లంకంత ఆస్పత్రి.. డాక్టర్లు లేరు!

- కొల్లేటికోట పీహెచ్‌సీలో నర్సులతోనే వైద్యం
- లోపించిన పారిశుధ్యం


డాక్టర్లు, సిబ్బంది లేక వెలవెలబోతున్న కొల్లేటికోట పీహెచ్‌సీ

కైకలూరు: కొల్లేటికోట పీహెచ్‌సీలో డాక్టరు లేకపోవడంతో నర్సులే వైద్యం చేస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదు కొల్లేరులంక గ్రామాలకు ఏకైక ఆధారం కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. 2020లో రూ.కోటి నిధులతో నూతన భవనాన్ని నిర్మించారు. ప్రతి రోజూ ఓపీ 40 నుంచి 60 వరకు ఉంటారు. పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, పెంచికలమర్రు, గుమ్మళ్లపాడు, శృంగవరప్పాడు, ఆలపాడు గ్రామాల ప్రజలు ఆరోగ్యసేవలు పొందడానికి లంక గ్రామాల్లో దీనిని ఏర్పాటు చేశారు. కోవిడ్ సమయంలో ఆరోగ్య కేంద్రానికి నూతన పరికరాలను సైతం అందించారు. ఆపరేషన్ థియేటర్, పురుషులు, స్త్రీలకు వేర్వేరు బెడ్‌లతో కూడిన గదులు. కాన్పుల గది ఇలా అనేక వసతులు ఉన్నాయి. అయితే ఒక్క డాక్టరు కూడా పీహెచ్‌సీలో లేకపోవడంపై కొల్లేరు ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

షిఫ్టుల ప్రకారం నర్సుల డ్యూటీ

కొల్లేటికోట పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులు ఉన్నారు. వీరు షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నారు. సుమారు ఆరు నెలల క్రితం డాక్టర్ శంకర్ పీజీ కోర్సు నిమిత్తం వెళ్లారు. మరో డాక్టర్ కిరణ్ నాలుగు నెలల క్రితం గుంటూరు ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. మగ, ఆడ సూపర్‌వైజర్లు సైతం నాలుగు నెలలుగా ఇక్కడ లేరు. ల్యాబ్ టెక్నీషియన్ సాంబశివరావు 10 నెలల క్రితం మరణించారు. ఆ పోస్టు వేయలేదు. ఎఫ్ఎన్‌ఓ, నైట్ వాచ్‌మెన్ లేరు. నూజివీడు నుంచి వచ్చే ఫార్మాసిస్టు లావణ్య మెడికల్ లీవ్‌లో ఉన్నారు. కలిదిండి పీహెచ్‌సీ డాక్టర్ హేమంత్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఇచ్చారు. ఇన్ని ఖాళీలు ఉన్నప్పటికీ వైద్యశాఖాధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు వాపోతున్నారు.


అపరిశుభ్రంగా వాష్ బేసిన్లు

పిచ్చిమొక్కల దర్శనం

కొల్లేటికోట పీహెచ్‌సీలో అడుగడున పారిశుద్ధ్యం సమస్య కనిపిస్తోంది. ప్రారంభంలోనే పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు వాడటానికి నీటి సౌకర్యం లేకపోవడంతో నిరూపయోగంగా మారాయి. రోగులు వస్తే తాగడానికి చుక్కనీరు లేదు. పీహెచ్‌సీ వెనుక వర్షం నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగిపోయాయి. వాడకం లేక ల్యాబ్ పరికరాలు సైతం పాడవుతున్నాయి. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు పెరిగాయి. ప్రతి ఆదివారం సమీపంలోని కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి వేలల్లో భక్తులు వస్తారు. ఇలాంటి ప్రాంతంలో ఒక్క డాక్టర్ కూడా పీహెచ్‌సీలో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.


ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ


పీహెచ్‌సీలోనే దర్శనమిస్తున్న పచ్చగడ్డి

పెచ్చులూడుతున్న మండవల్లి పీహెచ్‌సీ

కైకలూరు నియోజకవర్గంలో కొల్లేటకోట, శీతనపల్లి, కలిదిండి, కోరుకొల్లు, మూలలంక, మండవల్లి, తక్కెళ్లపాడు, ముదినేపల్లి, దేవపూడి, గురజ, ప్రాథమిక ఆరగ్యో కేంద్రాలతో పాటు కైకలూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ఉంది. మండవల్లి పీహెచ్‌సీలో శ్లాబ్ పెచ్చులూడుతోంది. వర్షం వస్తే వైద్య సిబ్బందితో పాటు రోగులకు నరకం కనిపిస్తోంది. ఇక్కడ ఫార్మాసిస్టు, ల్యాబ్ పరీక్షలు చేసే సిబ్బంది లేరు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కలిదిండి పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుల కొరత ఉంది. పూర్తి స్థాయి, సిబ్బంది, మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విన్నపాలు.. కొల్లేటి పాలు



కొల్లేటికోట పీహెచ్‌సీలో వైద్యులను నియమించాలని అధికారులకు వినతి పత్రాలు అందించాం. కొల్లేరులంక గ్రామాల ప్రజలు కైకలూరు వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే చాలా దూరం. లంక గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం చేయడానికి ఒక్క డాక్టరు కూడా లేరు. ఇప్పటికైనా డాక్టర్లను నియమించాలి.

– జల్లూరి వెంకన్న, మాజీ సర్పంచ్, పందిరిపల్లిగూడెం

పెచ్చులూడుతున్నాయి



మండవల్లి పీహెచ్‌సీకి చికిత్స కోసం వచ్చాను. డాక్టర్ వైద్యం బాగుంది. ఆస్పత్రి భవనంలో మాత్రం పెచ్చులూడుతున్నాయి. ఆవరణలో నీటి మడుగులు ఉన్నాయి. అధికారులు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– నాగలక్ష్మి, పెరికెగూడెం

క్లుప్తంగా

వాహనాల మళ్లింపుతో ట్రాఫిక్ సమస్య



గుడ్లవల్లేరు: గుడివాడ నుంచి ముదినేపల్లి రోడ్డులో ఉన్న రైల్వేగేట్ పనుల నిమిత్తం వాహనాలను మళ్లించంతో గుడ్లవల్లేరులో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఈ నెల 9నుంచి 22వ తేదీ వరకు గుడివాడ నుంచి ముదినేపల్లి రోడ్డులో మల్లాయపాలెం వద్దనున్న భీమవరం రైల్వే ట్రాక్ మరమ్మతులు జరుగుతున్నాయి. దీంతో ఆ దారిలో ఉన్న గేటును మూసివేయక తప్పలేదు. ఈ కారణంగా వాహనదారులకు ఇబ్బందులు వచ్చాయి. ముదినేపల్లి నుంచి గుడివాడ వైపు కాకుండా గుడ్లవల్లేరు మీదుగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. దీంతో గుడ్లవల్లేరులో ట్రాఫిక్ అధికమైంది.

సమస్యలను పరిష్కరించాలి

గుడివాడరూరల్: గుడివాడ అభివృద్ధికి అన్ని విధాలుగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఎమ్మెల్యే సోమవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. కూటమి నాయకులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, పంద్రాజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కోచ్ మారెళ్లకు సన్మానం




గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావును సోమవారం స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు జరిగిన నేషనల్ మాస్టర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోచ్ వెంకటేశ్వరరావు వివిధ విభాగాల్లో 410 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం సాధించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, వరప్రసాద్, జి. బాబు, జిమ్ కోచ్‌లు పి. ఉష, ఎస్. నరేంద్ర, జిమ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రాణదాతలకు సత్కారం



ముదినేపల్లి రూరల్: కారు ప్రమాదంలో భర్త ప్రాణాలు కోల్పోగా భార్యను కాపాడిన ప్రాణదాతలను మృతుడి కుటుంబీకులు సత్కరించారు. ఎస్ఐ వీరభద్రరావు కథనం మేరకు మండవల్లి మండలం లింగాలకు చెందిన చందు వెంకటేశ్వరరావు హైదరాబాద్ శాస్త్రవేత్తగా పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. గత నెల 29న హైదరాబాద్ నుంచి కారులో భార్యతో కలిసి వస్తుండగా ముదినేపల్లి సమీపంలోని పోల్‌రాజ్ డ్రెయిన్‌లోకి కారు దూసుకెళ్లడంతో వెంకటేశ్వరరావు మృతి చెందాడు. ప్రమాద సమయంలో వెంకటేశ్వరరావు దంపతుల కేకలు విని పక్కనే చెరువులపై పనిచేస్తున్న పశ్లిం ఆచార్య, అస్సాంకు చెందిన సుబుమ్ వచ్చి కారు అద్దాలు పగలగొట్టి రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందగా భార్య కృష్ణరాణిని కాపాడగలిగారు. ప్రాణాలు కాపాడిన వారిని వెంకటేశ్వరరావు సంస్మరణ సభలో ఒక్కక్కరిని రూ.25 వేల నగదు, శాలువాలతో సోమవారం సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ పాల్గొన్నారు.

వరిగడ్డి లోడుతో ఉన్న లారీ దగ్ధం



పమిడిముక్కల: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం రాత్రి తాడంకి బైపాస్‌లో ఉన్న వరిగడ్డి లారీకి ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో వరిగడ్డి, లారీ కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపు చేశారు. స్థానికంగా వరిగడ్డిని కొనుగోలు చేసి లోడ్ చేసుకొని బైపాస్‌లో లారీని ఉంచానని, రాత్రికి తీసుకెళ్లి చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో అమ్ముకొంటామని యజమాని చలపాటి రెడ్డియ్య తెలిపారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియడం లేదని పేర్కొన్నారు.

ఎఫ్ఏ-1 పరీక్షలు ప్రారంభం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో ఈనెల 14వ తేదీ వరకు జరిగే సెల్ఫ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ)-1 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని 12 గుర్తింపు పొందిన పాఠశాలలు, 46 ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలు, 9 జిల్లా పరిషత్ హైస్కూల్స్‌తో పాటు ఒక ఎయిడెడ్ హైస్కూల్, రెండు యూపీ పాఠశాలలు కలిపి 70 పాఠశాలల్లో ఈ పరీక్షలకు 5,194 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ-2 కే శ్రీలక్ష్మి తెలిపారు.

యూరియా కొరతతో రైతుల ఆందోళన


పెదమద్దాలిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు


కొతవరంలో యూరియా కోసం రైతుల పడిగాపులు


జెమీగొల్లెపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

గుడ్లవల్లేరు: మండలంలోని కొతవరం పీఏసీఎస్‌కు చెందిన రైతులకు యూరియా అరకొరగా అందటంతో ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం పీఏసీఎస్ ఎదుట రైతులు యూరియా కోసం పడిగాపులు పడ్డారు. కొతవరం పీఏసీఎస్‌తో పాటు పెంజెంద్ర పీఏసీఎస్‌కు కూడా ఈ గూడౌన్‌కే యూరియా దిగుమతి అవుతోంది. 170 టన్నులకు గాను కేవలం 70 టన్నులే రావటంతో రైతులకు యూరియా పంపిణీ అరకొరగా జరిగింది. బడా బాబులకు యూరియాను దొడ్డిదారిన కట్టబెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెదమద్దాలిలో..

పెదమద్దాలి(మొవ్వ): పామర్రు మండలంలోని రైతులు యూరియా కొరతతో ఇబ్బందులుపడుతున్నారు. డిమాండ్‌కు సరిపడా యూరియా సరఫరా లేనందున ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదమద్దాలి, జెమీగొల్లేపల్లి పీఏసీఎస్‌ల్లో యూరియా కోసం రైతులు బారులు తీసిన సంఘటనలు సోమవారం దర్శనమిచ్చాయి. ఒక గ్రామం ఉన్న సొసైటీకి 10 టన్నులు యూరియా వచ్చిందని, నాలుగు గ్రామాలు ఉన్న పెదమద్దాలి సొసైటీ కూడా అదే 10 టన్నులు రావటం ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా యూరియా కొరతను తీర్చాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా దృష్టికి పెదమద్దాలి నూతన కమిటీ చైర్మన్ రామకోటేశ్వరరావు తీసుకెళ్లినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం లోపుగా పరిష్కార మార్గం చూపిస్తానని ఎమ్మెల్యే చెప్పినట్లు రామకోటేశ్వరరావు నాలుగు గ్రామాల రైతులకు హామీ ఇచ్చారు.

మట్టిలో మాణిక్యాలు వెలికితీత


కాలేజీ భవనం


విజేతలకు అవార్డు ప్రదానం (ఫైల్)

- రేపు రాష్ట్ర స్థాయి శేషాద్రిరావు స్మారక అవార్డుల ప్రదానం
- సాంకేతికతలో ఏటా సత్తా చాటుతున్న పేద విద్యార్థులు

గుడ్లవల్లేరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో సాంకేతిక విద్యలో తమ సత్తా చాటుతున్న పేద విద్యార్థులు ఎందరో ఉన్నారు. అలాంటి మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం. అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. పాలిటెక్నిక్ కళాశాల వేదికగా మారింది. రాష్ట్రంలోనే ఈ కాలేజీ పాలిటెక్నిక్ విద్యలో ప్రఖ్యాతి గాంచింది. ఈ కళాశాల వ్యవస్థాపకుడు దివంగత వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు పేరిట ఏటా ఇస్తున్న రాష్ట్ర స్థాయి అవార్డులను రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి వారు గుడ్లవల్లేరులో 17ఏళ్లగా నిర్వహిస్తున్నారు. సాంకేతిక విద్యలో తమ సత్తాను ఎంతోమంది విద్యార్థులు చాటుకుంటున్నారు. ఏటా విజేతలు అవార్డులను తీసుకుని ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

విద్యా వ్యాప్తికి శేషాద్రిరావు కృషి

ఈ కాలేజీ వ్యవస్థాపకుడు శేషాద్రిరావు పల్లె ప్రాంతమైన గుడ్లవల్లేరులో విద్యా వ్యాప్తికి ఎనలేని సేవలు అందించారు. ఎల్‌కేజీ నుంచి పీజీల వరకు విద్యా సంస్థలను స్థాపించి కృషి చేశారు. ఒక్క పాలిటెక్నిక్ కాలేజీయే గాక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్, వీవీ ఫార్మసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలతో పాటు హైస్కూల్‌ను కూడా స్థాపించిన ఘనత శేషాద్రిరావుకే దక్కుతుంది.

రేపే స్టేట్ అవార్డుల ప్రదానం

గుడ్లవల్లేరులో 17వ వార్షిక వల్లూరుపల్లి వెంకట రామ శేషాద్రిరావు స్మారక అవార్డుల ప్రదానోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఏపీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ సాధించిన స్టేట్ టాపర్ గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థి ఆలూరి లలితా కోమలి (99.52%), స్టేట్ సెకండ్ టాపర్ నందమూరు వాసవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థి అంకెం అఖిలాదేవి(98.95%)కు శేషాద్రిరావు స్మారక అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా సంస్థ కార్యదర్శి జి.వి.వి.సత్యనారాయణ మూర్తి విచ్చేసి విజేతలకు అవార్డులను అందించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని కపిలేశ్వరపురం, హనుమంతపురం, ముళ్లపూడి, ఐనంపూడి, వేల్పూరు గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

14 నుంచి సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటరులోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు ఈ నెల 14 నుంచి 16 వరకు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు. ఉత్సవాల్లో 14న ఉదయం సుప్రభాతసేవ, నాగస్వరం, గోపూజ, వేదపారాయణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూర్తి హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 15న గోపూజ, సుప్రభాతసేవ, ఏకాదశ రుద్రాభిషేకం, దేవతామూర్తులకు పట్టు పవిత్రాల సమర్పణ జరుగుతాయని తెలిపారు. చివరిరోజైన 16న మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, పవిత్ర జల సంప్రోక్షణ కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఇదే రోజు ఉదయం పవిత్రసమర్పణ అనంతరం స్వామివార్ల మాసకల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే దంపతులు రూ.2,116 చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తారని ట్రైనీ కలెక్టర్ ఫర్వీన్ జీహీద్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని సాంకేతిక లోపాల వలన అవి అపరిష్కృతంగా ఉంటున్నాయన్నారు. వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలను ఉన్నతాధికారులు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తారని ఆమె అన్నారు. కార్యక్రమంలో రెండు దరఖాస్తులు వచ్చాయని ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏఓ జీటీ నాయుడు, మున్సిపల్ మేనేజర్ బి.నిర్మలకుమారి, ఏసీపీ వి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా కూచిపూడి



వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ పీఏసీఎస్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కూచిపూడి వెంకటసుబ్బారావు చౌదరి ఎంపిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వర్ల కుమారరాజా ఆశీస్సులతో సీఎం చంద్రబాబునాయుడు తనను నియమించటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

2,520 కుటుంబాల దత్తత

గుడ్లవల్లేరు: మండలంలోని 2,520 పేద కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 192 మంది మార్గదర్శులు మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఉన్న పేద కుటుంబాలను దత్తత తీసుకోవడంతో ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలులో గుడ్లవల్లేరు మండలం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. దీంతో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మార్గదర్శులు, సంబంధిత సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

శ్రీవిద్య కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తాం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ


శ్రీవిద్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాయపాటి శైలజ

కొండవరం(మొవ్వ): ఇటీవల వరకట్న వేధింపులకు బలైన పల్లికొండ శ్రీవిద్య ఆత్మకు శాంతి చేకూర్చేలా ఆమె కుటుంబ సభ్యులకు పూర్తి న్యాయం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ భరోసా ఇచ్చారు. ఇటీవల వరకట్న వేధింపులకు ఉయ్యూరులో అత్త వారింటి వద్ద ఈ నెల మూడో తేదీన మరణించిన పల్లికొండ శ్రీవిద్య వారి కుటుంబ సభ్యులను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సోమవారం మొవ్వ మండలం కొండవరంలో వారి గృహం వద్ద పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె జరిగి సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను బాధితురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని చర్యలు చేపట్టి నిందితులకు కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా విద్యార్థి దశలో ప్రతిభ కలిగి కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో బంగారు పతకం సాధించిన శ్రీవిద్య, ప్రైవేట్ కళాశాల నుంచి ఉద్యోగ అవకాశాన్ని పొందడంతో పాటు ఇటీవల రాసిన ఆర్‌ఆర్‌బీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి తన సత్తా నిరూపించుకుందని తెలిపారు. బంగారు భవిష్యత్తు కలిగిన ఆమె జీవితం విషాదకరంగా ముగియటం జీర్ణించుకోలేని సంఘటన అన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్ హేలా షారోన్, డీఎస్పీ ధీరజ్ వినీల్, తహసీల్దార్ మస్తాన్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఒక్కో సొసైటీకి 10 మెట్రిక్ టన్నుల యూరియా

సాక్షి ఎఫెక్ట్..

పమిడిముక్కల: 'ఎరువు.. కరువు' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని తాడంకి, గురజాడ, కపిలేశ్వరపురం, కృష్ణాపురం, అగినపర్రు, హనుమంతపురం సొసైటీలకు ఒక్కో సొసైటీకి 10 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియాను సరఫరా చేశారు. కృష్ణాపురం సొసైటీని ఏఓ గణేషరెడ్డి సందర్శించారు. చైర్మన్ రాజులపాటి శ్రీనివాసరావు, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. అనంతరం రైతులకు యూరియా పంపిణీ చేశారు.

ఎస్సీ సెల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

కైకలూరు: వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు కండ్రికగూడెం సుభీభవ కల్యాణ మండపంలో జరుగుతుందని, పార్టీ నాయకులు విచ్చేసి జయప్రదం చేయాలని జిల్లా ఎస్సీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ సాధు కొండయ్య కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్.సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తేర ఆనంద్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడుల్లో భారీగా జరిమానాలు


మాట్లాడుతున్న విజిలెన్స్ ఈఈ వాసు

కృత్తివెన్ను: విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన సోమవారం మండలంలో జరిగిన విజిలెన్స్ దాడుల్లో రూ. 7,97, 288 జరిమానాలుగా విధించినట్లు ఆ శాఖ విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు తెలిపారు. మండలంలోని 2006 గృహసర్వీసులు, 148 వాణిజ్య సర్వీసులు, 163 ఆక్వా సర్వీసులు తనిఖీ చేయగా వాటిలో 187 సర్వీసులకు గాను అధికంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి అపరాధ రుసుం విధించామన్నారు. విద్యుత్ చౌర్యం జరిగినట్లు తెలిస్తే 9440812091, 9440812362, 9440812363 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో మచిలీపట్నం ఈఈ గోవిందరావు, పెడన డీఈఈ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.